
ప్రజాశక్తి
ఆదివారం 17 ఆగస్టు 2025
5
పార్వతీపురం మన్యం



మరి ఇంతనిర్లక్ష్యమా?

పాలకొండ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం పలుచోట్ల ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేట్ సంస్థల్లోనూ జెండా ఎగరవేసి దేశభక్తిని చాటుకున్నారు జెండా పవిత్రత, విలువను కూడా పలువురు వివరించారు. అంతవరకు బాగానే ఉంది. అయితే స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో శనివారం వరకు జెండా విప్పలేదు. దీంతో ఎండకు ఎండుతూ వానికి తడుస్తూ జాతీయ జెండా అక్కడ ఉంది. చూసిన వారంతా ఇక్కడున్న అధికారులకు ఇంత నిర్లక్ష్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.


సబ్ రిజిష్టార్ కార్యాలయం వద్ద శనివారం తొలగించని జెండా

ఇంటింటా జ్వరపీడితులే

- పీడిస్తున్న వైరల్ ఫీవర్
- జలుబు, దగ్గు, కీళ్ల నొప్పులతో అవస్థలు
- మెడికల్ షాపులే క్లినిక్‌లు
- సొమ్ము చేసుకుంటున్న సంచి వైద్యులు


జ్వరంతో బాధపడుతున్న విద్యార్థి

కీళ్ల నొప్పులతో హడలిపోతున్న బాధితులు

కీళ్ల నొప్పులు, ఒంటినొప్పులతో చాలామంది తీవ్రంగా బాధపడుతున్నారు. ఇది చికెన్ గున్య కాదని, సీజన్‌లో వచ్చే వైరల్ వ్యాధులను వైద్యులు చెబుతున్నారు. ఒకసారి కీళ్లనొప్పులు, ఒంటినొప్పులతో జ్వరం వచ్చిన వ్యక్తి కనీసం రెండు నుంచి మూడు నెలల వరకు ఆ బాధలతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బయటికి వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. మరికొంత మంది చేతి కర్రను ఊత పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయి. ప్రభుత్వం ఇటువంటి అరుదైన వ్యాధుల పట్ల తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు


వైద్యం కోసం మెడికల్ షాపు వద్ద నిరీక్షిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

వాతావరణ మార్పుల్లో భాగంగా ఒక పక్క ఎండలు, మరోపక్క జోరుగా వర్షాలు. దీంతో ఎక్కడ చూసినా దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మన్యం జిల్లాలో రోజు రోజుకు జ్వరాలు, వైరల్ ఫీవర్లతో రోగులు పెరిగిపోతున్నారు. చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఎటు చూసినా ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇంట్లో ఇద్దరు, ముగ్గురేసి చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. శరీరంలో రోగనిరోధకశక్తి తగ్గడం వల్లే ఈ బాధలు వస్తున్నాయని వైద్యులు చెప్తున్నారు. ముఖ్యంగా సాలూరు ఏజెన్సీ ప్రాంతంలోని తోణాం, కురుకూటి, మామిడిపల్లి, గిరిశిఖర గ్రామాలైన కొఠియా గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఎక్కడ చూసినా ఈ కీళ్ల నొప్పులు, జ్వరాలతో ప్రతి గ్రామంలో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారు. ఈ జ్వరంతో బాధపడే వారు స్థానిక ఆర్ఎంపిల వద్ద వైద్యం చేయించుకోవడం, అప్పటికీ తగ్గకపోతే ప్రభుత్వ ఆసుపత్రులకు చేరడం పరిపాటిగా మారింది. ఇందులో పిల్లలు ఎక్కువ మంది ఉన్నారు. వీరిని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లకుండా దగ్గరలో ఉండే మందుల షాపుల యాజమానుల వద్ద వైద్యం చేయిస్తున్నారు. ఇదే అదునుగా మందులు షాపుల యాజమానులు వారికి నచ్చిన మందులను ఇచ్చి జ్వర పీడితులకు ఒక్కొక్క జ్వరానికి ఒక్కొక్క రేటుగా నిర్ణయించి మూడు రోజులు, ఐదు రోజులు, ఏడు రోజులు కోర్సులుగా రూ.3వేల నుంచి రూ.10వేలు వరకు వసూలు చేస్తున్నారు.

రోగులకు దూరంగా ఉండాలి

జ్వరపీడితులకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ జ్వర పీడితులు వాడిన వస్తువులు, బట్టలు వాడకపోవడం మంచిది. ఎందుకు కంటే రోగులకు ఉండే వైరస్ ఇతరులకు వ్యాప్తి చెందకుండా ఉంటుంది. చాలా వరకు వైరల్ ఫీవర్లు దోమలు వల్ల వ్యాప్తి చెందుతాయని కాబట్టి దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఆర్ఎంపిలను ఆశ్రయిస్తున్న బాధితులు

సాధారణంగా ఏ వ్యక్తికైనా జ్వరం, జలుబు, కీళ్ల నొప్పులు, ఇంకా ఏమైనా బాధలు వస్తే స్థానికంగా ఉండే వైద్యులను సంప్రదించాలని, ఇంకా అక్కడ తగ్గకపోతే మంచి వైద్యం కోసం సాలూరు, విజయనగరం వెళ్తుంటారు. కానీ ఈ ప్రాంతంలో ఎక్కువమంది చిన్నపిల్లల దగ్గర నుంచి పండు ముదసలి వరకు ప్రభుత్వాసుపత్రి వద్దకు, రిజిస్టర్ వైద్యుల వద్దకు వెళ్లకుండా స్థానికంగా ఉండే ప్రైవేటు మందులు షాపుల వద్దకు వెళ్లి ఆ షాపుల


తోణాం పిహెచ్‌సిలో ఒపి రాయిస్తున్న గిరిజనులు

యాజమాన్యం దగ్గర మందులు తీసుకొని వెళ్తున్నారు. ముఖ్యంగా సాలూరు ఏజెన్సీ ప్రాంతం మొదటి నుండి మలేరియా, టైఫాయిడ్ మొదలగు రోగాలు ఎక్కువగా వ్యాప్తి చెందడంతో ప్రభుత్వం కూడా ఈ ప్రాంతంలో ఉండే అన్ని ప్రభుత్వాసుపత్రుల వద్ద వాటికి సంబంధించిన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతుంటారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు అవి ఇస్తుంటారు. డబ్బులు వెచ్చించి ఒంటిని, ఇంటిని గుల్ల చేసుకుని లక్షల వెచ్చించుకుంటూ చివరి దశలో వైజాగ్, విజయనగరం వెళ్తున్నారు. ఈ ప్రాంతంలో చాలామందికి ఇది అలవాటుగా మారింది. ఈ అలవాటును ఇప్పటికైనా ప్రభుత్వం మార్చేలా కృషి చేయాలని, జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించేలా వైద్య సిబ్బంది కషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కనిపించని ఫాగింగ్

వర్షాకాలంలో దోమలు ప్రబలి రాజ్యమేలుతుంటాయి. అది పుట్టకుండా కుట్టకుండా ఉండడానికి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దీనికి తోడు క్రమం తప్పకుండా ప్రతి వీధిలో ఫాగింగ్‌ను ఎప్పటికప్పుడు నిర్వహించుకోవాలి. కానీ నేడు పట్టణాల్లో, పల్లెల్లో చాలా వరకు ఫాగింగ్ చేసిన దాఖలాలు కనిపించకపోవడంతో దోమలు స్వైర విహారం చేయడంతో ఏ ఇంట్లో చూసినా జ్వర పీడితులే అధికంగా కనిపిస్తున్నారు. ఈ ప్రాంతంలో జ్వరాలు తగ్గాలన్నా క్రమం తప్పకుండా కాలువలను పరిశుభ్రం చేస్తూ, నీటిని నిల్వ లేకుండా చేస్తూ ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహించేలా పాలకవర్గాలు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు

ప్రజాశక్తి - కురుపాం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుపాం మండల కేంద్రంతో పాటు పరిసర గిరి శిఖర గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. గత కొద్ది రోజులు నుండి పెద్దగా వర్షాలు లేక చిరుజల్లులు పడడంతో ఎండ వేడిమి వేసవిని తలపించేలా ఉండడంతో తట్టుకోలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతుండగా వర్షంతో కొంత ఉపశమనం కలగగా, మరోవైపు ఇప్పటికే ఉడిసిన ఉబాలకు, ఆరుతడి పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భామిని : మండలంలో కుండపోత వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షంతో, భామినిలోని పలు లోతట్టు ప్రాంతాల్లోని పత్తి పంట నీటమునిగింది. దీంతో రైతులు పత్తి పొలాల నుంచి నీటి తరలించే పనిలో నిమగ్నమయ్యారు.


భామినిలో నీటమునిగిన పత్తి పంట

పార్వతీపురం టౌన్ : పట్టణంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు, ఒడిస్సా సరిహద్దు ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురవడంతో వరద నీరు పట్టణ పరిధిలో గల వరహాల గెడ్డలోకి భారీగా చేరుతుంది. దీంతో శనివారం ఉదయం ఆ గెడ్డ పరివాహక ప్రాంతాలైన సౌందర్య థియేటర్ వెనక ఉన్న కాలనీలు వరదనీటితో నిండిపోయాయి. దీంతో ఆయా కాలనీలోని స్థానికులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులకు గురయ్యారు. వర్షా కాలం ప్రారంభానికి ముందే గెడ్డ పరివాహక ప్రాంతంలో పేరుకు పోయిన పూడిక తీతలు తొలగించక పోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పార్వతీపురం : జలమయమైన సౌందర్య థియేటర్ వెనుక కాలనీ

వర్షాల పట్ల అప్రమత్తం : కలెక్టర్

పార్వతీపురం : జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్ష వర్షాలు కురిసే సూచన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరగరాదని, ఇందుకోసం ముందుగా గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 17,18 తేదీల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున లోతట్టు, నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను దండోరా, మైక్ ద్వారా ప్రచారం చేస్తూ అప్రమత్తం చేయాలని అన్నారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్య ఆరోగ్యం పట్ల ఆయా శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు సమాచారం పొందడం, తీసుకోవడం చేయవచ్చని అన్నారు.

అమ్మ ఎవరిపై కరుణ చూపేనో?

ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ
ఈసారైనా బయటి వారికి చోటు దక్కేనా?

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన దేవత శంబర పోలమాంబ అమ్మవారి దేవస్థానానికి సంబంధించి ఎట్టకేలకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావాహుల్లో ఉత్సాహం నెలకొంది. ఈనెల 11 నుంచి ధర్మకర్తల మండలి కోసం సభ్యులుగా చేరదల్చుకొనేవారు దరఖాస్తు చేసుకోవచ్చని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయ ఇఒ బి.శ్రీనివాస్ ప్రకటన విడుదల చేశారు. గతేడాది కమిటీ నిర్వహణతోనే జాతర నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రస్థాయి హోదా దక్కించుకున్న పోలమాంబ అమ్మవారి ట్రస్టు బోర్డుకు ఈసారి గట్టిగా తెలుగు తమ్ముళ్లు వారి వారి పైరవీలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. గత జాతరలో కమిటీ ఏర్పాటులో శంబరకు చెందిన నైదాన తిరుపతిరావుకు చైర్మన్ హోదా కల్పించడంలో మంత్రి సంధ్యారాణి ప్రత్యేక శ్రద్ధ చూపారన్నది జగమెరిగిన సత్యం. ఈ ఏడాది రెండేళ్ల పాటు ట్రస్ట్ బోర్డు ఏర్పాటలో మంత్రి సంధ్యారాణి చెప్పిన వారికే చైర్మన్ గిరి దక్కే అవకాశం ఉన్నందున ఆ దిశగా పలువురు తెలుగు తమ్ముళ్లు తెర వెనుక మంత్రాంగం జరుగుతున్నట్లు సమాచారం. మరోవైపు పేర్లు ఎవరూ బయటకు చెప్పకపోయినప్పటికీ, తమకు లేదా తమవారికి చైర్మన్ గిరి దక్కుతుందన్న ఆశతో ముందే అంచనాలు వేసుకుంటున్నారు. ఏది ఏమైనా అటు పోలమాంబ అమ్మవారి కరుణాకటాక్షాలతో పాటు, మంత్రి కరుణ కూడా ఎవరు వైపు ఉంటుందో..?నన్న సర్వత్రా చర్చ నడుస్తోంది.



బయట వ్యక్తులకు ఛాన్స్ దక్కేనా..?

కొన్నేళ్లుగా పోలమాంబ అమ్మవారి ట్రస్ట్ బోర్డు లేదా ఉత్సవ కమిటీ తదితర పదవులన్నీ ఒక్క శంబర గ్రామవాసులకు పరిమితమవుతూ వస్తున్నాయి. ధర్మకర్త మండలిలో కనీసం నియోజకవర్గ స్థాయి మండలాల వారికి కూడా ప్రాధాన్యత కల్పించాల్సి ఉన్నప్పటికీ, ఈ రకమైన చేర్పులు ఎప్పుడూ కల్పించే పని అటు అధికారులు కానీ, ఇటు ప్రజాప్రతినిధులు గానీ చేయకపోవడం గమనార్హం. ఈసారి రాష్ట్ర జాతరగా అవతరించిన పోలమాంబ అమ్మవారి ట్రస్ట్ బోర్డు ఒక గ్రామానికి పరిమితం చేయకుండా విస్తరించాలన్న డిమాండు పలువురిలో వ్యక్తమౌతు.ది. గత కొన్ని నెలలుగా తోటపల్లి దేవస్థానం కూడా ఇదే రీతిలో ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తూ వస్తోంది. ఈసారి ట్రస్ట్ బోర్డులో మిగిలిన మండలాల వారికి చోటు కల్పించినట్లయితే ఆలయ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు లభించే ఆస్కారం ఉందని పలువురు భావిస్తున్నారు. ఆ దిశగా రాజకీయ నాయకులు, అధికారులు ప్రయత్నాలు చేయాలని పలువురు కోరుతున్నారు.

హక్కుల సాధనకై పోరాటాలకు సిద్ధం కావాలి

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆదివాసీల హక్కుల సాధనకై భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ఆదివాసీలంతా సిద్ధం కావాలని ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తూరులో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ గిరిజన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ఉన్న అడవులను, కొండలను కార్పొరేట్ పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. అదానీ, అంబానీలకు ఊడిగం చేస్తూ గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధి, వికాసానికి ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న పీసా చట్టాన్ని, గిరిజన చట్టాలన్నింటినీ పక్కనపెట్టి గిరిజనులకు తీవ్ర నిరాశ మిగిల్చాయని ఆరోపించారు. గిరిజనులకు రక్షణగా ఉన్న జిఒ 3ను రద్దు చేసిందని, గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రోడ్లు, వంతెనలు వంటి మౌలిక సదుపాయాల్లేకపోవడం వల్ల నిరంతరం డోలీ మోతలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తవుతున్న నేటికీ గిరిజనుల బతుకులు మారడం లేదని, మార్పునకు ప్రభుత్వాలుగానీ, ప్రజాప్రతినిధులు గానీ సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గిరిజనులను రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుగానే చూస్తున్నారే తప్ప వారి సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. మండలంలో కురుకుట్టిలో అదాని హైడ్రో పవర్ ప్రాజెక్టును గిరిజనుల పోరాటాలను, మనోభావాలను గుర్తించి ప్రభుత్వం అనుమతులను రద్దు చేసిందని తెలిపారు. ఇప్పటికైనా గిరిజన ప్రాంతంలో గిరిజనులకు నష్టం చేసే అక్రమ మైనింగ్ వంటి అనుమతులు ఇవ్వొద్దని, గిరిజన చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు. మండలంలో అటవీ, అన్ సర్వేడ్, బంజరు భూములను సాగు చేస్తున్న గిరిజనులు, పేదలు ఎన్నో ఏళ్లగా ఎటువంటి హక్కులు లేకుండా సాగు చేస్తున్నారని, ఇటువంటి భూములన్నింటికీ సర్వేలు నిర్వహించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే గిరిజనులు పోరాటాలకు సిద్ధపడతారని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, గెమ్మెల జానకీ రావు, ఆదివాసీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు సూకురు గంగయ్య, నాయకులు మెల్లిక అయోధ్య, చింత జోగయ్య, గెమ్మెల బోడమ్మ, కొర్ర సీతమ్మ, కూనేటి దాలయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు తగవు

7న జిల్లా మహాసభను జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధి హామీ చట్టం కింద పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కార్యదర్శి బివి రమణ, కోశాధికారి జి.వెంకటరమణ కోరారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో మండంగి హరనాధ్ అధ్యక్షతన నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 20 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న తర్వాత కూడా కేవలం నెలకు రూ.5,700 వేతనంతో పని చేస్తున్నారని అన్నారు. కనీస వేతనాలు అమలు చేయక ఉద్యోగ భద్రత కల్పించక తీవ్ర ఆవేదనకు ప్రభుత్వాలు గురి చేస్తున్నాయన్నారు. కింది స్థాయిలో జరుగుతున్న అవినీతికి ఫీల్డ్ అసిస్టెంట్లను బాధ్యులను చేసి ఇప్పుడు ఆడిట్ పేరుతో చిన్న, చిన్న కారణాలతో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం, రికవరీలు పేరుతో వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికై సిఐటియు ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక ఆందోళనలు చేపట్టామని భవిష్యత్తులో ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి సెప్టెంబర్ 7న జరుగు ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు మండంగి హరినాథ్, వన్నెల వుజ్జుడయ్య, వి.నాగరాజు, లాడి దుర్గారావు, రౌతు అప్పలనాయుడు, చల్ల సింహాచలం, టి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పట్టని ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జిల్లాలోని టిడిపికి చెందిన ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై ఒకింత నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈనెల 14న జరిగిన డిఆర్‌సి సమావేశానికి ఒక్కరంటే ఒక్క ఎమ్మెల్యే కూడా హాజరు కాకపోవడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఇంతకు మించిన ప్రాధాన్యత ఏముంటుందనేది చాలా మంది వాదన. ఇందుకు కారణం లేకపోలేదు. డిఆర్‌సి (జిల్లా సమీక్షా మండలి) సమావేశం కన్నా మించిన సమావేశం జిల్లా స్థాయిలో మరొకటి లేదనే చెప్పాలి. ఇందుకోసం అధికారులు ప్రోటోకాల్ ప్రకారం ముందస్తుగానే ఆహ్వానాలు పంపుతారు. గతం సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు, సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన పురోగతి, అమలకు సంబంధించిన అంశాలు తదితర వివరాలను సభ్యులందరికీ ముందస్తుగానే తెలియజేస్తారు. వీటన్నింటికన్నా జిల్లాలో ముందుకు వచ్చిన ప్రజా సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికార యంత్రాంగానికి దిశానిర్ధేశం చేసే అధికారం డిఆర్‌సి సమావేశానికి మాత్రమే ఉంటుంది. జరిగిన తప్పిదాలను, లోటుపాట్లను, అవినీతి, అక్రమాలను సరిదిద్దడం, చర్యలు తీసుకోవడం వంటివి కూడా ఇక్కడే జరుగుతుంటాయి. ఇంతటి కీలకమైన సమావేశానికి నెల్లిమర్ల ఎమ్మెల్యే (జనసేన) లోకం నాగమాధవి మినహా విజయనగరం, బొబ్బిలి, ఎస్.కోట, చీపురుపల్లి, రాజాం ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. వీరంతా టిడిపికి చెందినవారే. నోరు మెదిపితే ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి పాటుపడుతున్నామంటున్న వీరంతా ఈ సమావేశానికి హాజరు కాకకుండా వాటిని ఎలా చక్కదిద్దుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలా అని సమస్యలు లేవా? అంటే కొకొల్లలుగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం ఉబాలు సాగుతున్న సమయం. తోటపల్లి చివరి ఆయుకట్టుకు నీరు అందడం లేదు. ముఖ్యంగా చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల్లో తీవ్రమైన ఇబ్బందులు ఉన్నాయి. ఎందుకు అందడంలేదో? క్షేత్ర స్థాయి పరిస్థితులు ఏమిటో సమావేశానికి సారధ్యం వహించిన అమాత్యుల వారికి అర్థం కాని పరిస్థితి. ఎమ్మెల్యేలు హాజరై వాస్తవ పరిస్థితులు తెలియజేస్తే అసలు సమస్య ఏమిటో? దానికి పరిష్కారమైమిటో తెలిసేది. అందుకు పరిష్కారం కూడా దొరికేది. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో లిఫ్ట్ ఇరిగేషన్, అనధికార పైపులైన్లతో నీటిని అడ్డగిస్తున్నారని అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత ఎమ్మెల్యే హాజరైతే అక్కడి రైతుల ఆవేదన తెలియజేసేవారేమో. ఈనేపథ్యంలో సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడడం సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ అదేశించడం అమాత్యులవారి వంతైంది. మరోవైపు ఎరువుల కోసం రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అధికారులేమో కొదవలేదంటున్నారు. దీనిపై వాస్తవ పరిస్థితులు వివరించేందుకు ఎమ్మెల్యేల కూడా గొంతు కూడా వినిపించలేదు. పరిశ్రమల మూత, కార్మికుల ఉపాధి దెబ్బతినడం వంటి అంశాలపైనా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చర్చించేందుకు ప్రయత్నించారు. అందుకుగల కారణాలు చెప్పే ప్రజాప్రతినిధులే లేకపోవడంతో అధికారులు చెప్పిన లెక్కలు వినడం తప్ప ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి అధికారులు లెక్కలు మాత్రమే చెప్పగలుగుతారు. ఫెర్రో ఎల్లాయిస్ వంటి పరిశ్రమల ఒడిదొడుకులకు గల కారణాలు అధికారుల కన్నా ప్రజాప్రతినిధుల దృష్టిలోనే ఎక్కువగా ఉంటాయి. ఇలా అన్ని శాఖలపైనా తగిన ఫీడ్ బ్యాక్ రాకపోవడంతో అధికారులు చెప్పిందే వేదంగా సమావేశం నడిచిపోయింది. సుపరిపాలన పేరిట గ్రామాల్లో చెక్కెర్లు కొట్టిన ఎమ్మెల్యేలు, వాటి పరిష్కార వేదికగా ఉపయోగించుకోవాల్సిన డిఆర్‌సి సమావేశానికి డుమ్మా కొట్టడంతో వీరికి ప్రజాసమస్యలపట్ల చిత్తశుద్ధి లేదంటూ పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.

పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్

పార్వతీపురం టౌన్ : జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లోనూ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆయా పోలీస్ స్టేషన్లో ఉన్న అధికారులు, సిబ్బంది నిర్వహించారు. అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ప్రారంభించారు. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాల యం చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలు, డిసిఆర్‌బి, ఎస్బి, కమ్యూ నికేషన్, మహిళా సెల్, డిపిఒ, ఆర్మ్డ్ రిజర్వు ఆఫీసులు, జిల్లాలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లు, ఎస్డిపిఒ, సర్కిల్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొని, వారి స్టేషన్లు/కార్యాలయాలు శుభ్రం చేశారు. అలాగే చుట్టుపక్కల పరిసరాల్లో ఉండే చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు.

గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల పెండింగ్ జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు జలుమూరు గౌరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో చెత్త సేకరణ చేస్తూ బ్లీచింగ్, దోమల మందు పిచికారి, కాలువల్లో పూడికతీత, ప్రజా ప్రతినిధులు అధికారులు వచ్చినప్పుడు సున్నం చల్లడం ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పనిచేస్తున్నారని చెప్పారు. వారికి ప్రతినెలా జీతాలను పంచాయతీలు చెల్లించడం లేదని చెప్పారు. జీతం, ఇతర సమస్యల పరిష్కారం చేయమంటే బెదిరింపు చర్యలకు దిగుతూ పని మానేయమని బెదిరిస్తున్నారని అన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే ప్రతినెలా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చెత్త సేకరణ బండ్ల రిపేర్ చేయించాలని, పెండింగ్ జీతాలు, మాస్కులు, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ పంపిణీ చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పాండా, కిషోర్, భీముడు, పోలీసు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సిపిఎం బృంద సభ్యులు వేణు

యూరియా అందడం లేదు

సిపిఎం బృందం ముందు రైతుల ఆవేదన

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలోని అంపావల్లి గ్రామంలో యూరియా కోసం ఇబ్బందులు పడుతున్న రైతులు సిపిఎం బృందం ముందు తమకు యూరియా సకాలంలో అందడం లేదని వాపోయారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి ఆవు సాంబమూర్తి తదితరుల బృందం శనివారం అంపావల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాట్లు పడినా యూరియా అందక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీలర్ల దగ్గరికి యూరియా కోసం వెళితే యూరియాతోపాటు గులికలు, నానో యూరియా, నానో పాస్ఫేట్ తీసుకుంటేనే యూరియా ఇస్తామని చెబుతున్నారని, ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో రైతులు తప్పక యూరియాతోపాటు గులికలు ఇతర పురుగు మందులు కొంటున్నారన్నారు. రైతుల్ని ఈ విధంగా పీడించడం మంచి పద్ధతి కాదని చెప్పారు. ఇప్పటికైనా మండల అగ్రికల్చర్ అధికారులు స్పందించి రైతులు దగ్గర నుండి దోపిడీ చేస్తున్న వ్యాపారస్తులను అరికట్టాలని రైతులకు యూరియా అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రాము, సూర్యారావు, శ్రీనివాసరావు, సిపిఎం పార్టీ నాయకులు గౌరీ, విశ్వేశ్వరరావు, శివరాం, సన్యాసినాయుడు, వై మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

'యశ్వంత్ కుమార్ రెడ్డి మాకొద్దు'


•రెగ్యులర్ పిఒను నియమించాలి

ప్రజాశక్తి- సీతంపేట

పాలకొండ సబ్ కలెక్టర్‌గా కొత్తవారిని ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో సీతంపేట ఐటిడిఎ ఇంఛార్జి పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సీతంపేట పిఒగా ఉండటానికి ప్రయత్నం చేస్తున్నారని అతను తమకు వద్దని పలువురు వక్తలు తేల్చి చెప్పారు. సీతంపేట మండలం, సీతంపేట ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షతన సమావేశం స్థానిక సివిలియు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి జెఎసి అధ్యక్షుడు బిడ్డిక శ్రీనివాసరావు మాట్లాడుతూ యస్వంత్ కుమార్ రెడ్డి పిఒగా తమకొద్దని సభాముఖంగా తెలియజేశారు. ప్రతి ఐటిడిఎలో జీవో 3 పునరుద్ధరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ వర్క్ షాప్ నిర్వహిస్తే ఇక్కడ మాత్రం ఈయన నిర్వహించలేదన్నారు. ఆదివాసీల మనోభావాలు, ఆదివాసీ అభివృద్ధి గాని, ఆదివాసి కల్చర్ గురించి పట్టించుకోలేదన్నారు. ఈయనకు ఆదివాసీల పట్ల విశ్వాసం లేదన్నారు. అడలి వ్యూ పాయింట్ వెళ్లిన పర్యాటకులు ఎంతోమంది రోడ్డు బాగు లేక యాక్సిడెంట్లు అవుతూ చనిపోయినా సరే వాటి గురించి పట్టించుకోలేదన్నారు. ఏజెన్సీలో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న అడలి వ్యూ పాయింట్‌లో గిరిజనేతరులకు అనుమతులు ఇవ్వడం దారుణమన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున కూడా సమన్వయ లోపం కనిపించిందన్నారు. ఏజెన్సీలో 1/70 చట్టం గానీ, ఎల్విన్‌పేట కోర్టు ఆర్డర్ 29 ఎల్ఓటిఆర్ కేసులు అమలు చేయలేదన్నారు. సీతంపేట హై స్కూల్ ఎదురుగా ఉన్న గిరిజనేతర్ల భవనానికి అనుమతులు ఇవ్వడం, ప్రభుత్వ స్థలం జీసిసి ల్యాండ్ 13 సంవత్సరాలు లీజ్ కు ఇవ్వడం కూడా లోపంగా ఆదివాసీ జెఎసి భావిస్తోందన్నారు. సీతంపేట ఐటిడిఎ అభివృద్ధికి ఆయన చేసింది శూన్యమన్నారు. ఈయన వల్ల అసలు ఐటిడిఎ ఉందా లేదో అనే స్థాయికి ఆదివాసీలు వచ్చారంటే పరిస్థితి అర్థం చేసుకోవాలన్నారు. అటువంటి వ్యక్తిని తొలగించి కొత్త రెగ్యులర్ ప్రాజెక్ట్ అధికారిని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో సీతంపేట ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ కార్యదర్శులు బిడ్డిక ఉమామహేశ్వరరావు, కొండగొర్రె భాస్కరరావు, నిమ్మక కాంతారావు, తోయక తిరుమలరావు, కొండగొర్రె వినోద్, మీడియా ప్రతినిధులు రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు



అవార్డు అందుకుంటున్న పద్మావతి

విస్తరిస్తున్న సంజీవ్ రక్షా సేవలు

ప్రజాశక్తి - పాలకొండ

2023లో ఏర్పడిన సంజీవ్ రక్ష ఫౌండేషన్ సేవలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. నాటి నుంచి నేటి వరకు కార్యక్రమాలు చేపట్టారు. సుమారు 260 వైద్య శిబిరాలు నిర్వహించి సుమారు 34 వేల మందికి వైద్య సేవలు అందించారు. సుమారు 10వేల మందికి శానిటేషన్ ప్యాడ్లు పంపిణీ చేశారు. 1200 మంది గర్భిణీలకు, 1100 మంది శిశువులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సంస్థ చేసిన సేవలకు గాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫౌండేషన్ చైర్పర్సన్ దూబ పద్మావతికి మంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ అవార్డు అందించారు.



కృష్ణమూర్తిని అభినందిస్తున్న మంత్రి, ఎస్‌పి

కృష్ణమూర్తికి పోలీస్ సేవా పతకం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకుల్లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకుల్లో, పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొమిరి కృష్ణమూర్తి విధుల్లో అందించిన ఉత్తమ సేవలకు గాను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ సేవా పతకం అందుకున్నారు. కృష్ణమూర్తిని జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో పాటు పలువురు సిఐలు, ఎస్ఐలు తోటి పోలీస్ సిబ్బంది అభినందించారు.

మంత్రి పచ్చి అబద్ధాల కోరు

- నోరు తెరిస్తే అబద్ధాలనే వల్లె వేస్తున్నారు
- టిడిపి కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారు
- ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే తప్పా : రాజన్నదొర

ప్రజాశక్తి- సాలూరు

రాష్ట్ర ప్రభుత్వంలో రెండు కీలకమైన శాఖలకు మంత్రిగా ఉన్న సంధ్యారాణి పచ్చి అబద్దాల కోరని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర విమర్శించారు. ఆమె నోరు తెరిస్తే అబద్ధాలనే వల్లె వేస్తున్నారని, సిఎం చంద్రబాబును మించి అబద్దాలాడుతున్నారని ధ్వజమెత్తారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మంత్రి సంధ్యారాణి విలేకరుల సమావేశం నిర్వహించి అబద్ధాలను బాగా వండి వార్చారని చెప్పారు. 18 ఏళ్ళు ఎమ్మెల్యేగా, మంత్రిగా తానేమీ అభివృద్ధి పనులు చేయలేదని, తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులనే ఆమె చేసినట్లు చూపించుకోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. సొంత పార్టీ నాయకులు కార్యకర్తలే ఆమె అబద్ధాలను చూసి అసహ్యించుకునే పరిస్థితికి వచ్చారన్నారు. ఆమె మంత్రి కాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఐసిడిఎస్ రీజినల్ అర్గనైజర్‌గా, ఎస్‌టి కమిషన్ సభ్యురాలిగా పని చేశారని గుర్తు చేశారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఎమ్మెల్సీగా ఆరేళ్ళు పని చేశారని తెలిపారు. ఆ సమయాల్లో ఆమె చేసిన అభివృద్ధి పనులేమిటో, తీసుకొచ్చిన నిధులేమిటో చెపితే ప్రజలు హర్షించేవారని చెప్పారు. అలా కాకుండా జంకూ బొంకూ లేకుండా తాను చేసిన అభివృద్ధి పనులనే ఆమె చేశానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు తన హయాంలో నిర్మించిన రోడ్లు మీదుగానే ఆమె తిరుగుతున్నారని చెప్పారు. ఆమె సొంత గ్రామం కదిరిపిల్లికి తన హయాంలోనే రోడ్డు నిర్మించినట్లు గుర్తు చేశారు. గతంలో అనేకసార్లు తాను సవాల్ చేశానని, అభివృద్ధి పనులపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమేనని చెప్పారు. పట్టణంలో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి 2019లో అప్పటి మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు శంకుస్థాపన చేశారని, తర్వాత పనులేవీ ప్రారంభించలేదని చెప్పారు. వైసిపి ప్రభుత్వం హయాంలో 70శాతం ఆసుపత్రి పనులు పూర్తయ్యాయని చెప్పారు. అయితే ఆసుపత్రిని తానే కట్టించినట్లు మంత్రి సంధ్యారాణి గొప్పలు చెప్పుకొంటున్నారని విమర్శించారు. తహశీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాలు కూడా తానే నిర్మించానని చెప్పడం అతి పెద్ద అబద్ధమని చెప్పారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని రాజన్నదొర హితవు పలికారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసినట్లు టిడిపి నాయకులు సూపర్ హిట్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ యువతకు భృతి పథకాలు అమలు చేయకుండా సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరి రఘు, వైసిపి నాయకులు ఎంఎస్ నారాయణ, బీసపు బాలకృష్ణ, మేకల శంకరరావు, కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

సాలూరు: రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని రాజన్నదొర విమర్శించారు. ఇటీవల కడప జిల్లా పులివెందుల, ఒంటిమెట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో టిడిపి నిస్సిగ్గుగా ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ సమక్షంలోనే పోలింగ్ కేంద్రాల్లో బహిరంగంగా రిగ్గింగ్ చేశారని చెప్పారు.



వినతి పత్రాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరించడమే ప్రజా దర్బార్ లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలపై వినతులు అందించారు. సమస్యలు పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు తెలియజేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యలు త్వరగా పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నియెజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

కూలిన పెంకుటిల్లు గోడ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో ఉన్న కంచరవీధి, కొత్త వీధి మధ్య సందులో ఉన్న పాత పెంకుటిల్లు గోడ శనివారం ఉదయం అకస్మాత్తుగా కూలిపోయింది. ప్రతిరోజు ఆ సందు అనేక మంది స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే గోడ కూలీల సమయంలో ఆ సందు గుండా ఎలాంటి రాకపోకలు జరగకపోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, పట్టణంలో పలు వార్డుల్లో గల పాత భవనాలను ఆయా వార్డుల పరిధిలో ఉన్న వార్డు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలను గుర్తించి, ఎలాంటి ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకముందే సంబంధిత గృహాల యజమానులకు నోటీసులను అందజేసి పాత భవనాలను తొలగించేందుకు దృష్టి సారించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది.



గ్రామ పరిసరాల్లో తిరుగుతున్న ఏనుగులు

ఏనుగుల గుంపు సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జరడ పంచాయతీ గిరి శిఖర గ్రామాల్లో నాలుగు ఏనుగుల గుంపు శనివారం సంచారిస్తూ గిరిజనులు సాగు చేస్తున్న పోడు వ్యవసాయాన్ని ధ్వంసం చేస్తున్నాయి. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ నిత్యం కొండలకు వెళ్లి పోడు వ్యవసాయం సాగు చేస్తూ జీవనం సాగిస్తుంటామని, అంతేకాకుండా ఇళ్లు కూడా కొండలకు దగ్గరలో ఉంటాయని తెలిపారు. దీంతో ఏనుగులు ఏ క్షణాన మా ఇళ్లపై దాడి చేస్తాయోనని ని బిక్కు బిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందించిన సమయంలో ఏనుగుల రూపంలో ఇలా పాడు చేయడం ఆర్థికంగా చితికి పోతున్నామని వాపోతున్నారు. కావున అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను తమ గ్రామాల నుంచి దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

గడగమ్మలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మి సచివాలయం పరిధి గడగమ్మ గ్రామంలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ, గర్భిణులు, చిన్నారులు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి, ఏఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - వీరఘట్టం

హైకోర్టు జడ్జిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తమ స్వగ్రామమైన మండలంలోని కత్తులకవిటికి విచ్చేసిన గేదెల తుహీన్ కుమార్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం గౌరవ పూర్వకంగా కలిశారు. ఆయనకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ జ్ఞాపికను అందజేసి దుశ్శాలువాతో సన్మానించారు. జడ్జిని కలిసిన వారిలో జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి, వీరఘట్టం ఎంపిపి దమలపాటి వెంకటరమణ నాయుడు, పాలకొండ, రేగిడి ఆమదాలవలస వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాశరావు, టంకాల అచ్చంనాయుడు, వావలపల్లి జగన్మోహన్ రావు, బంకి లక్ష్మణమూర్తి, పొట్నూరు లక్ష్మణరావు, పొట్నూరు పరిసినాయుడు, కర్రి గోవిందరావు, నల్లి శివప్రసాద్, తిర్లంగి ఉపేంద్ర కుమార్, వాసు తదితరులు ఉన్నారు.



జడ్జిని సత్కరిస్తున్న నాయకులు

అప్పుడే మరమ్మతులా?

పనుల్లో కొరవడిన నాణ్యత

ప్రజాశక్తి - వీరఘట్టం

ముచ్చటగా మూడు రోజులైనా కాలేదు అప్పుడే రహదారి మరమ్మతులా అంటూ స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. మండలంలోని సిఎస్‌పి రహదారి నుండి చిదిమి గ్రామం వరకు ఈ ఏడాది మార్చి నెలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.20కోట్లతో ఐటిడిఎ అధికారుల పర్యవేక్షణలో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. రహదారి నిర్మాణ పనులు జరిగినప్పుడు అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేపట్టారు. దీంతో పది కాలాలు ఉండవలసిన రహదారి మరమ్మతులకు గురైందంటే పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చును. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హాయాంలో చిదిమి ఆదర్శ గ్రామం కావడంతో 2006లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 97 లక్షలతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. అంచెలంచెలుగా రహదారి మరమ్మతులు గురి కావడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపుగా రెండు దశాబ్దాల కాలంలో రహదారి పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులు, గర్భిణులు, రోగులు ప్రయాణం సాగించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రహదారి నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ పనుల్లో నాణ్యత ప్రమాణం లేకపోవడంతో మరలా మొదటి స్థితికే రోడ్డు వచ్చిందనిస్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటించని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని, స్థానికులు కోరుతున్నారు.



మరమ్మతుకు గురైన రోడ్డు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

పట్టణంలో గొల్ల వీధి కూడలిలోని శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆమె శ్రీకృష్ణుని వేషధారణలో ఉన్న పిల్లలతో కొద్దిసేపు గడిపి సత్యభామ వేషధారణలోనున్న పిల్లలతో కోలాటం ఆడారు.

సీతంపేట: మండలంలో పులిపుట్టి సమీపంలో ఉన్న భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు కరస్పాండెంట్ ఎస్‌పి పెంటయ్య, ప్రిన్సిపాల్ ఎస్.నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడి వేసదారణలో పలువురిని అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, మురళీ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీ పురం: మండల కేంద్రంలో బొత్తాడ గౌరీ శంకర్రావు ఆధ్వర్యంలో యువత ఉట్టి కట్టి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఎల్విన్‌పేట గ్రామంలో కూడా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. గ్రామ పెద్దలు, మహిళాలు పాల్గొన్నారు.

కురుపాం : కురుపాం బస్టాండ్, సరస్వతి విద్యానికేతనలో శనివారం ఉట్టి సంబరం ప్రిన్సిపాల్ కె. శ్రీరామ్మూర్తి నాయుడు, బోట్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణ, రాధా రుక్మిణి, గోపికలు వేషధారణలు వేసి పలు వీధుల్లో నృత్యాలు చేశారు. చిన్నారుల వేషధారణలు పలువురులు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉట్టి సంబరం నిర్వహించగా గ్రామంలో యువత పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సాలూరు: చిన్నారిని ఎత్తుకుని సందడి చేస్తున్న మంత్రి



కురుపాం : వివిధ వేషధారణలో చిన్నారులు



సీతంపేట: కృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు



గుమ్మలక్ష్మీపురం: ఉట్టి కొడుతున్న యువత

రామచంద్రరావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - సాలూరురూరల్

కామ్రేడ్ సిద్ధాబత్తుల రామచంద్రరావు ప్రజలకు, సిపిఐ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. శనివారం సిద్ధాబత్తుల సంస్మరణ సభ రామచంద్రరావు స్వగృహంలో జరిగింది. ముందుగా రామచంద్రరావు చిత్ర పటానికి పూలదండ వేసి సిపిఐ నాయకులు నివాళ్లు అర్పించారు. అనంతరం ఉమ్మడి విజయ నగరం జిల్లా ఎఐటియుసి నాయకులు బలగ రాధ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో రామచంద్రరావు సేవలనుకొనియాడారు. విజయన గరం జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం, సమ సమాజ స్థాపనకు రామచంద్రరావు తుది శ్వాస వరకు కృషి చేశారన్నారు. కార్మిక హక్కులను కాపాడేందుకు అనునిత్యం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు రామచంద్రరావు అని కొనియాడారు. కురుకూటి, మోసూరు, కొట్టక్కి భూ పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించి పేదలకు న్యాయం చేశారన్నారు. సుదీర్ఘ కాలం పాటు సాలూరు మోటారు కార్మిక యూనియన్ అధ్యక్షులుగా సేవలందించారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, ఎఐటియుసి ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కొనసాగారన్నారు. జీగిరాం జ్యూట్ మిల్ సమస్య పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. పోరాటాలు, నిర్బంధాలతో పలు కేసులను ఎదుర్కొన్నప్పటికీ తను నమ్మిన సిద్ధాంతం కోసం ముందుకు సాగారే తప్ప వెనకడుగు వేయని ధీరుడు రామచంద్రరావు అని కొనియాడారు. గిరిజన ప్రాంతాల సమస్యలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటి పరిష్కారానికి రామచంద్రరావు విశేష కృషి చేశారన్నారు. కౌన్సిలర్‌గా కూడా సేవలందించారన్నారు. రామచంద్రరావు మరణం పార్టీకి, కార్మిక లోకానికి తీరని లోటని మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు అన్నారు. ప్రముఖ న్యాయవాది కండా ప్రసాదరావు మాట్లాడుతూ తన జీవితమంతా పేదల పక్షాన నిలిచిన రామచంద్రరావు పేద ప్రజల గుండెల్లో బతికే ఉంటారన్నారు. కార్యక్రమంలో మన్యం జిల్లా రైతు సంఘం కార్యదర్శి, మన్యం జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, సాలూరు మోటారు వర్కర్స్ యూనియన్ నాయకులు గంధం శంకరరావు, బుడితి భారతి, సూర్యం, ప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రామచంద్రరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వక్తలు

శిథిల భవనంలో చదువులెలా?

ప్రజాశక్తి - కొమరాడ

శిథిలావస్థలో భవనంలో గిరిజన విద్యార్థులకు చదువులు ఎలా నేర్పుతారని, ఒకవేళ బిల్డింగ్ కూలిపోయి పిల్లలకు ఏమైన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని జల గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం వద్ద విద్యార్థులతో కలిసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలీవానవచ్చినా, తుఫాను వచ్చినా, మండుటెండలో ఒకే గదిలో పిల్లల చదువుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ గ్రామంలో పూర్వకాలంలో నిర్మించిన ఈ భవనాన్ని బాగు చేయాలని అధికారులకు ఎందుకు గుర్తుకు రావడంలేదని ప్రశ్నించారు. కిటికీలకు తలుపు లేకపోవడంతో ఆ గదిలో ఉన్న బీరువాలో ప్రభుత్వానికి సంబంధించిన రికార్డులు కూడా గాలికి ఎగిరిపోవడం, వర్షానికి తడిసిపోయే పరిస్థితి కనిపిస్తుందని అన్నారు. పెద్ద వాన వస్తే గదంతా నీటితో నిండిపోతుందన్నారు. పెద్దశాఖ పంచాయతీకి చెందిన జల గ్రామంలో జిపిఎస్ స్కూలు ఎప్పుడో నిర్మించారని, స్కూల్ మొత్తం రేకులతో నిర్మించడం వల్ల ఆ రేకులు శిథిలావస్థకు చేరడంతో పాటు పక్కన కిటికీలకు కూడా తలుపులు లేవన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి శిథిలావస్థలో భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కొల్లి సాంబమూర్తి

దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- సాలూరు రూరల్

స్థానిక కొంకి వీధిలో శ్రీవెంకటేశ్వర దేవస్థానం నూతన కమిటీ సభ్యులచే మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల సేవ కోసం సభ్యులంతా భక్తితో సమిష్టిగా కృషి చేసి దేవస్థానం అభివృద్ధి కోసం పారదర్శకతతో ముందుకు సాగాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా దేవాలయానికి వచ్చే ప్రతి ఒక్కరితో గౌరవ ప్రదంగా వ్యవహరించి ప్రతి ఒక్కరిలో దైవభక్తిని పెంచే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం అధ్యక్షులు నాగోలు నర్సింగరావు (తాతాజీ), కార్యవర్గ సభ్యులుగా కాళ్ళ లక్ష్మీకాంతం, పేర్ల విశ్వేశ్వరరావు, జంపా సత్యం, గాడి పద్మావతి, బొంగ బాలమ్మ, కోట్ని ప్రసాదరావు, గుట్టిపల్లి సింహాచలం ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన తనిఖీదారు ఎన్ రాజ కుమారి, ఆలయ ఇఒ టి.రమేష్, పట్టణ టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కాళ్ళ శ్రీను, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులను అభినందిస్తున్న మంత్రి సంధ్యారాణి

భావితరాలకు స్ఫూర్తి గౌతు లచ్చన్న : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం

భావితరాలకు స్ఫూర్తిదాయకం సర్దార్ గౌతు లచ్చన్న అని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా గౌతు లచ్చన్న చిత్ర పటానికి పూలమాలను వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న అని కొనియాడారు. దూరదృష్టి, దృఢమైన గాంధేయవాదంతో అంటరాని తనం, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. హరిజన సేవా సంఘాన్ని స్థాపించి, వారి కోసం రాత్రి పాఠశాలలు ప్రారంభించి, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చురుగ్గా పనిచేశారని తెలిపారు. రైతు రక్షణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా అఖిల భారత కిసాన్ సభను నిర్వహించిన ఘనత ఆయనిదేనని తెలిపారు. రైతులు, గిరిజన సంఘాలకు అండగా నిలవడమే కాకుండా రైతుల హక్కులను కాపాడ్డానికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, బిసి సంక్షేమ, సాధికారత అధికారి ఇ.అప్పన్న, జిల్లా శాలివాహన కుమ్మరి సంఘ ప్రధాన కార్యదర్శి ఉరిటి యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే